1st Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF PEN

సంపుటి : 3 సంచిక : 121
గురువారం 07 మే 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## వలసదారులపై ట్రంప్ ఆంక్షలు వ్యక్తిగతమే..



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 06)


అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశంలోకి వస్తున్న వలసలపై ఉక్కుపాదం మోపుతూ.. కఠినమైన నిర్ణయాలు తీసుకున్న విషయం తెలిసిందే. ట్రంప్ వలస విధానాలపై చాలామంది అమెరికన్లు అసంతృప్తితో ఉన్నారు. ఆయన చేపట్టిన వలస విధానాలు వ్యక్తిగతమేనని వారు భావిస్తున్నారు. ఒకప్పుడు వలసదారులకు గొప్పదేశంగా ఉన్న అగ్రరాజ్యం ఇకపై ఆ విధంగా ఉండబోదని భావిస్తున్నారు. అక్రమ వలసల పేరుతో ట్రంప్ తీసుకుంటున్న కఠిన చర్యలు చాలా దూరం వెళ్లాయని వారు అభిప్రాయపడుతున్నారు. అమెరికాలో ఏపీ-ఎన్ఓఆర్సీ ఇటీవల నిర్వహించిన పోల్‌లో ఈ విషయం వెల్లడైంది.

ట్రంప్ చర్యల వల్ల తమకు తెలిసిన ఎందరో వలసదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు అమెరికన్లు పేర్కొన్నారు. ఇంటి నుంచి బయటకు రావడానికి కూడా వారు భయపడుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో అమెరికా తిరిగి వలసవాదులను ఆదరించినా.. ట్రంప్ విధానాల వల్ల దేశానికి కలిగిన నష్టాన్ని పూడ్చడానికి చాలా ఏళ్లు పట్టే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వలసలకు వ్యతిరేకంగా రూపొందించిన విధానాల్లో భాగంగా నైపుణ్యం గల విదేశీయులను తిరిగి వారి స్వదేశాలకు పంపుతున్నారని.. దీనివల్ల దేశాభివృద్ధి నెమ్మదించే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. మరోవైపు అమెరికాలోని వలసదారుల సంతానానికి దేశ పౌరసత్వం ఇవ్వకూడదనే ట్రంప్ నిర్ణయాన్ని కొందరు వ్యతిరేకిస్తుండగా.. మరికొందరు మాత్రం సమర్థిస్తున్నారు.

## రాష్ట్రపతి భవన్‌కు 'ఆప్' పంచాయతీ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 06)

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నుంచి ఇటీవల బయటకు వెళ్లిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు భాజపాలో చేరడం, తదనంతర పరిణామాల పంచాయతీ రాష్ట్రపతి భవన్‌కు చేరింది. ఆ ఏడుగురిలో ఆరుగురు



పంజాబ్ నుంచి రాజ్యసభకు వెళ్లినవారే కావడంతో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి ఎంపీల రాజ్యసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు. వారిపై చర్య తీసుకోవాలంటూ దాదాపు 90 మంది ఎమ్మెల్యేలు సంతకాలు చేసిన ఓ వినతిపత్రాన్ని ఆయన అందజేశారు. రాష్ట్ర శాసనసభలో ఇద్దరు సభ్యులున్న భాజపాకు ఇప్పుడు ఆరుగురు ▶మిగతా 2లో

## ఓటర్లు బలమైన మార్పు కోరుకున్నారు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 06)


'నాలుగు రాష్ట్రాలు.. ఒక కేంద్ర పాలిత ప్రాంతం ఎన్నికల ఫలితాల్లో ఓటర్ల చైతన్యం మరోసారి



స్పష్టంగా కనిపిస్తోంది. పాలన నచ్చితే మళ్లీ మళ్లీ గెలిపిస్తారు. లేకుంటే నిర్దాక్షిణ్యంగా ఓడిస్తారనడానికి ఈ ఫలితాలే చక్కని ఉదాహరణ. తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్ ప్రజలు ఈసారి మార్పును బలంగా కోరుకున్నారు. అస్సాం, పుదుచ్చేరిల్లో తమ ప్రాభవాన్ని నిలబెట్టుకుని పశ్చిమ బెంగాల్ ప్రజల మనసును గెలుచుకున్న భాజపాకు అభినందనలు. ఆ పార్టీ అగ్రనాయకత్వం అకుంఠిత దీక్ష శ్లాఘనీయం' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'పశ్చిమ బెంగాల్ ప్రజల నమ్మకాన్ని పొందడానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కొన్ని సంవత్సరాలుగా చేసిన కృషి ఇప్పుడు ▶మిగతా 2లో

# రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు
# 17వ ఎస్ఐపీబీ ఆమోదం

- ●విశాఖలో రూ.1 లక్ష కోట్లతో రిలయన్స్ డేటా సెంటర్‌కు గ్రీన్ సిగ్నల్
- ●సత్యసాయి జిల్లాలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్
- ●కడపలో రూ.12 వేల కోట్లతో అదానీ హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు
- ●తిరుపతిలో రూ.2,500 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమ
- ●రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం... 39 వేల మందికి ఉద్యోగాలు
- ●నిర్దేశిత గడువుకు ముందే అనుమతులతో ఓ బ్రాండ్ సృష్టిద్దాం
- ●సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 17వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల బోర్డు సమావేశం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 06)

రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి వస్తోంది. విశాఖలో రిలయన్స్ సంస్థ రూ.1,08,010 కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. అలాగే సత్యసాయి జిల్లాలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్ ను, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టంను కూడా రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనుంది. కడపలో రూ.12 వేల కోట్లతో అదానీ హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును, తిరుపతిలో రూ.2,500 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. వీటితో పాటు పలు పెట్టుబడులకు రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు బుధవారం ఆమోదం తెలిపింది.

**ప్రతీ ఒప్పందం గ్రౌండ్ కావాలి :** రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి వచ్చిన ప్రతీ ప్రతిపాదనా ఒప్పందంగా మారాలని, కుదుర్చుకున్న ప్రతీ ఒప్పందం పెట్టుబడిగా రూపాంతరం చెందాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఒక పెట్టుబడి, పరిశ్రమ రాష్ట్రానికి వచ్చే విషయంలో అనుమతుల నుంచి శంకుస్థాపన, ప్రారంభోత్సవం వరకు నిర్దేశిత గడువులోగా జరిగేలా చూడాలన్నారు. ఒప్పందం చేసుకున్న కంపెనీల శంకుస్థాపన నుంచి ఉత్పత్తి వరకూ నిర్దిష్టమైన కాలపరిమితిలో జరిగేలా ▶మిగతా 2లో

## విద్యలో గాలిలో మేడలు వద్దు గట్టి పునాదే ముద్దు...

**అక్కడి నుంచే లోకేశ్ సంస్కరణలు**
**పాఠశాల విద్యలో సమస్యలు గుర్తింపు.. సంస్కరణల అమలు**
**పునాది దశ అభ్యసనాలు మెరుగుపరిచేందుకు ప్రణాళికలు అమలు**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 06)

గాలిలో మేడలు కట్టొద్దు అని హితవు చెప్పే పెద్దలు నేలపై నిలబడమంటారు. సవాళ్లతో కూడిన విద్యాశాఖను చేపట్టిన నారా లోకేశ్ గాలిలో మేడలు కట్టే యంత్రాంగానికి అసలు మన విద్య ఎక్కడుందో చూడండంటూ ఆదేశాలిచ్చారు. విదేశాల్లో విద్యాభ్యాసం పూర్తి చేసుకుని, విదేశాల్లోనే వరల్డ్ బ్యాంకులో ఉన్నత ఉద్యోగం చేసిన లోకేశ్ విద్యాశాఖలో ఫ్యాన్సీ విదేశీ విద్యావిధానాలు అమలు చేయాలని యత్నించలేదు. గత పాలకుల మాదిరిగా టోఫెల్, ఐబీ అంటూ నేల విడిచి సాము చేయలేదు. ▶మిగతా 2లో

## విమర్శించడం తప్ప పేర్ని నానికి బందరు ప్రయోజనాలు పట్టవు: కొల్లు రవీంద్ర

**బందరు చరిత్ర తిరగరాసేలా నగరాన్ని అభివృద్ధి చేస్తామన్న కొల్లు రవీంద్ర**
**రోడ్లు, తాగునాటి సౌకర్యాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమని వెల్లడి**
**గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందకుండా చేసిందని విమర్శ**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 06)



బందరు (మచిలీపట్నం) చరిత్ర తిరగరాసేలా నగరాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర ధీమా వ్యక్తం చేశారు. ఈరోజు బందరులో తాగునీటి పైపులైన్లు, డీడబ్ల్యూఎమ్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఆయన... ప్రతి ప్రాంతానికి రోడ్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మున్సిపాలిటీ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కేవలం విమర్శలకే పరిమితమైన మాజీ మంత్రి పేర్ని నానికి బందరు ప్రయోజనాలు పట్టవని మండిపడ్డారు. ▶మిగతా 2లో

## రాజకీయ నాయకులకు డబుల్ ఫైన్.. హోంమంత్రి అనిత కీలక ఆదేశాలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 06)

ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత ట్రాఫిక్ నిబంధనల అమలుపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయ నాయకులు హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే రెట్టింపు జరిమానా విధించాలని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు భద్రత విషయంలో ఎవరికీ మినహాయింపులు ఉండవని, నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలను అరికట్టగలమని ఆమె స్పష్టం చేశారు. అనకాపల్లి జిల్లాలో 'సురక్షిత రోడ్లు.. సురక్షిత జీవితం' నినాదంతో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆమె పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అడ్డరోడ్డు నుంచి నక్కపల్లి వరకు జరిగిన ఈ బైక్ ర్యాలీలో మంత్రి అనిత మాట్లాడుతూ.. "లక్షల రూపాయలు పెట్టి బైక్ కొనేవారు, ప్రాణాలను కాపాడే వెయ్యి రూపాయల హెల్మెట్‌ను కొని ధరించడానికి ఎందుకు ఆలోచిస్తున్నారు? ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది హెల్మెట్ లేకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోయారు. ప్రాణం విలువను ప్రతి ఒక్కరూ గుర్తించాలి" అని అన్నారు.

ఈ సందర్భంగా తన పాయకరావుపేట నియోజకవర్గంలో జరిగిన రోడ్డు ప్రమాదాలను గుర్తుచేసుకుని ▶మిగతా 2లో

## పిడుగురాళ్ల బోధనాసుపత్రిలో 20 నుంచి ఓపీడీ సేవలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 06)

పిడుగురాళ్ల బోధనాసుపత్రిలో ఈ నెల 20 నుంచి అవుట్ పేషెంట్ విభాగం (ఓపీడీ) సేవలు ప్రారంభిస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. వైద్య కళాశాలలు, వసతిగృహాల నిర్మాణం, వైద్య సిబ్బంది నియామకాలపై సచివాలయంలో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాలలో ▶మిగతా 2లో

## 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను నిలిపివేసిన ట్రంప్



**ఇరాన్‌తో చర్చల్లో పురోగతి**
**అందుకే ఈ నిర్ణయమన్న ట్రంప్**
**ఇరాన్‌పై దిగ్బంధనం మాత్రం కొనసాగుతుందని స్పష్టీకరణ**
**ఇరాన్ సైనిక శక్తిని పూర్తిగా దెబ్బతీశామని వ్యాఖ్య**

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 06)

ఇరాన్‌తో చర్చల్లో పురోగతి సాధించామని, పాకిస్థాన్ వంటి దేశాల అభ్యర్థన మేరకు కీలక నిర్ణయం తీసుకున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. హర్మూజ్ జలసంధిలో అమెరికా నేతృత్వంలో చేపట్టిన 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఆయన బుధవారం ప్రకటించారు. అయితే, ఇరాన్‌పై విధించిన దిగ్బంధనం మాత్రం పూర్తిస్థాయిలో కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ మేరకు ట్రంప్ సోషల్ మీడియాలో ఒక ప్రకటన విడుదల చేశారు. "ఇరాన్‌తో తుది ఒప్పందం దిశగా గణనీయమైన పురోగతి సాధించాం. పాకిస్థాన్, ఇతర దేశాల అభ్యర్థన మేరకు 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్' కింద నౌకల కదలికలను కొంతకాలం నిలిపివేయాలని నిర్ణయించాం. ఒప్పందం ఖరారవుతుందో లేదో చూసేందుకే ఈ విరామం" అని ఆయన పేర్కొన్నారు.అంతకుముందు వైట్‌హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన ట్రంప్, ఇటీవలి సైనిక చర్యల్లో ఇరాన్ నావికా, వైమానిక దళాలు పూర్తిగా దెబ్బతిన్నాయని వ్యాఖ్యానించారు. వారి సైనిక శక్తిని సర్వనాశనం చేశామని, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోందని, అందుకే ఇరాన్ ఒప్పందం కోసం ముందుకు వస్తోందని ఆయన అన్నారు. ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హర్మూజ్ జలసంధి తమ నియంత్రణలోనే ఉందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కూడా స్పష్టం చేశారు. ఇరాన్‌తో చర్చల ఫలితం వెలువడేంత వరకు ఈ తాత్కాలిక విరామం కొనసాగనుంది.

## ప్రకాశం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చావలి రమేష్ బాబు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 6)

ప్రకాశం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చావలి రమేష్ బాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు కలసి అభినందనలు తెలియజేశారు. అభినందనలు తెలిపిన వారిలో బీసీవై పార్టీ నాయకులు చల్లా హరి, బీసీ నాయకులు మిరియం శ్రీనివాసులు యాదవ్, జేఏసీ నాయకులు చిరుమామిళ్ల గోపికృష్ణ యాదవ్, దూల అప్పారావు, ఎమ్మార్పీఎస్ నాయకులు కంభంపాటి రాజబాబు, అభినందనలు తెలియజేశారు.

## జేఈఈ మెయిన్స్ 2026 ఫలితాలలో రాణించిన శ్రీ ప్రతిభ విద్యార్థులు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 6)

మంగళవారం విడుదలైన జేఈఈ మెయిన్స్ 2026 పేపర్2 పరీక్షా ఫలితాలలో శ్రీ ప్రతిభ విద్యార్థులు ఆల్ ఇండియా ర్యాంకులు సాధించారు. గులుగులూరి నీలిమ (260311112353) 10 ర్యాంకు, బాసంగారి మరియ సందీప్ (260310249995) 50 ర్యాంకు, కోలా విష్ణు (260310347775) 247 ర్యాంకు, అన్నపునేని రాహుల్ (260310661654) 258 ర్యాంకు, కుమ్మర వెంకట కళ్యాణ్ బాబు (260310441030) 260 ర్యాంకు, బండారు గోపిచంద్ (260310448504) 358 ర్యాంకులు సాధించారు. ఇంకా 496, 552, 601, 632, 712, 806, 821, 878, 906, 926 ర్యాంకులతో పాటు 1000 లోపు 20 మంది, 2000 లోపు 39 మంది ర్యాంకులు సాధించారని శ్రీ ప్రతిభ విద్యాసంస్థల ఛైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సిఇఓ నల్లూరి జయప్రకాశ్ నారాయణ్ విద్యార్థినీ, విద్యార్థులకు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి అభినందనలు తెలిపారు.

## ఆడుదాం ఆంధ్రలో జరిగిన అవినీతి పై శాఖా పరమైన చర్యలు

### శాప్ ఛైర్మన్ ఏ రవి నాయుడు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 6)

ఆడుదాం ఆంధ్రలో జరిగిన అవినీతిపై విజిలెన్స్ కమిటీ ఇచ్చిన నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందించడం జరిగిందని తదుపరి అవినీతిపరుల పై శాఖా పరమైన చర్యలు ఉంటాయని ఒంగోలు కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన మీడియాతో మాట్లాడుతూ శాప్ ఛైర్మన్ ఏ రవి నాయుడు అన్నారు. గత ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పేరుతో భారీ అవినీతికి పాల్పడిందని ఆరోపించిన రవి నాయుడు అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, క్రీడా శాఖ మంత్రి రోజా అందులో భాగస్వాములని విమర్శించారు. త్వరలోనే వారి పైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# మొదటి పేజీ తరువాయి

## రాష్ట్రపతి భవన్‌కు 'ఆప్' పంచాయతీ

రాజ్యసభ సభ్యులు ఉండటం ఎలా సాధ్యమని ముర్ము దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్రపతి భవన్ నుంచి బయటకు వచ్చాక మాన్ మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగ నిపుణులతో సంప్రదించి దీనిపై స్పందిస్తానని రాష్ట్రపతి హామీ ఇచ్చారన్నారు. "ఆప్‌లో కొనసాగడం ఆ ఎంపీలకు ఇష్టం లేకపోతే రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేయాల్సింది. ఇటువంటి వాటిని అడ్డుకొనేందుకు రాజ్యాంగంలో 'రీకాల్' వ్యవస్థ ఉండాలి" అని తెలిపారు. ఎంపీల పార్టీ మార్పిడిని రాజ్యాంగ విరుద్ధం, హత్యగా మాన్ అభివర్ణించారు.మరోవైపు.. ఆప్ నుంచి భాజపాలో చేరిన ఎంపీల బృందంలో కీలక సభ్యుడైన రాఘవ్ చడాధ సైతం మంగళవారం భగవంత్ మాన్ కంటే ముందే రాష్ట్రపతిని కలిసి ఓ వినతిపత్రాన్ని సమర్పించారు. పంజాబ్ సర్కారు తమపై రాజకీయ ప్రేరేపిత వేధింపులకు పాల్పడుతోందని ఫిర్యాదు చేశారు. పోలీస్, విజిలెన్స్, పొల్యూషన్ బోర్డు వంటి సంస్థల దుర్వినియోగంతో తమపై ఒత్తిడి తీసుకువస్తూ ప్రమాదకరమైన ఆట ఆడుతున్నారని తెలిపారు.

## ఓటర్లు బలమైన మార్పు కోరుకున్నారు

ఫలితాన్ని ఇచ్చింది. వారితోపాటు భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, పశ్చిమబెంగాల్ నేత సువేందు అధికారి, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామికి అభినందనలు' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

**పార్టీని స్థాపించిన కొద్ది కాలంలోనే...**

'తమిళనాడులో ప్రముఖ కథానాయకుడు విజయ్.. పార్టీని స్థాపించిన కొద్ది కాలంలోనే చక్కటి విజయాన్ని అందుకున్నారు. సింహభాగం ప్రజలు టీవీకే వైపు మొగ్గు చూపారు. విజయ్‌కు అభినందనలు. అన్నాడీఎంకే, భాజపా బలమైన పోరాటం చేశాయి. కేరళలో కాంగ్రెస్ నాయకత్వంలో ఎన్నికల్లో గెలిచిన యూడీఎఫ్ నాయకులకూ అభినందనలు' అని పవన్‌కల్యాణ్ ఆ ప్రకటనలో వివరించారు.

## రాజకీయ నాయకులకు డబుల్ ఫైన్.. హోంమంత్రి అనిత కీలక ఆదేశాలు

ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రాణం కంటే విలువైనది ఏదీ లేదు. మన నియోజకవర్గంలో ఒకే నెలలో జరిగిన రోడ్డు ప్రమాదాలు ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేశాయి. ఇకనైనా మేల్కొని 'హెల్మెట్ ధరిద్దాం-సురక్షితంగా పయనిద్దాం' అనే నినాదాన్ని పాటిద్దాం. మన ప్రాణాలను, మన కుటుంబాల భవిష్యత్తును కాపాడుకుందాం" అని అనిత పిలుపునిచ్చారు. ర్యాలీలో భాగంగా ఆమె పలువురు వాహనదారులకు స్వయంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించి, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని కోరారు.

## పిడుగురాళ్ల బోధనాసుపత్రిలో 20 నుంచి ఓపీడీ సేవలు

ఈ విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్ ప్రవేశాలకు అనుగుణంగా బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు, నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. డీఎంఈ, డీపీహెచ్, గుంటూరు ఆర్డీ, జిల్లా కలెక్టర్ స్థాయిలో నియామకాలను ఈ నెలాఖరు లోగా పూర్తిచేయాలన్నారు. అవసరమైతే ఒప్పంద పద్ధతిలో బోధన సిబ్బందిని నియమించాలని సూచించారు. ఆసుపత్రిలో ఓపీ సేవలు అందుబాటులోకి వస్తున్న విషయం ప్రజలకు చెప్పాలన్నారు. రోగులు ఆసుపత్రికి చేరుకునేలా రవాణా సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. నిర్మాణ సంస్థ యాజమాన్యంతో ఫోన్లో మాట్లాడి మే 20 లోగా పనులు పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఇన్‌ఛార్జి డీఎంఈ రాధికారెడ్డి, డీపీహెచ్ పద్మావతి, ఏపీఎంఎస్ఐడీసీ సీఈ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

## విద్యలో గాలిలో మేడలు వద్దు గట్టి పునాదే ముద్దు...

నేషనల్ అచీవ్ మెంట్ సర్వే, యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ నివేదికల మేరకు కనీస అభ్యసనా సామర్థ్యాలు విద్యార్థుల్లో లేవని గుర్తించారు. ఇవి పెంపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

**దేశంలోనే తొలిసారిగా .గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్**

భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా 38391 ప్రాథమిక పాఠశాలల్లో గ్యారెంటీడ్ ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ (జీ-ఎఫ్ఎల్ఎన్) అమలు ఆరంభించారు. ప్రతీ విద్యార్థికి బలమైన పునాది అభ్యసనాలు ఒత్తిడితో కాదు, ఉల్లాసంతో, ఆటపాటలతో మొదలవ్వాలి. అందుకే మన ప్రభుత్వ పాఠశాలల్లో 1, 2 తరగతుల విద్యార్థుల కోసం గ్యారెంటీడ్ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (జీ-ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని అమలు చేస్తుంది.మన ప్రాథమిక పాఠశాలల్లోకి అడుగుపెడితే, విద్యార్థులు పుస్తకాల్లోని అంశాలను బట్టీ పట్టడం కాకుండా, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్, ఎడ్యుటైన్‌మెంట్ యాక్టివిటీస్ వంటి, బాలా ఫీచర్స్ వంటి బోధన ద్వారా ఎంతో సరదాగా, ఆహ్లాదకరంగా, ఆనందంగా, ఆడుతూ పాడుతూ నేర్పుతున్నారు. చిత్రాల ద్వారా అక్షరాలు నేర్చుకోవడం, ఆటల ద్వారా అంకెలు లెక్కించడం వంటి పద్ధతుల ద్వారా తెలుగు, ఇంగ్లీష్ భాషలను బోధిస్తున్నారు.జ్ఞానజ్యోతి, జ్ఞానప్రకాశ్ వంటి మాడ్యూల్స్ ద్వారా ప్రతి అక్షరాన్ని, ప్రతి శబ్దాన్ని అనుభూతి చెందుతూ విద్యార్థులు నేర్చుకుంటున్నారు. పెద్ద తరగతులకు వెళ్ళే వరకు వేచిచూడకుండా, మొదటి నుండే పునాదిని బలంగా నిర్మించడం గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ ప్రత్యేకత. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలకు అనుగుణంగా, వారి స్థాయిని అంచనా వేసి తదనుగుణంగా పాఠ్య ప్రణాళిక సిద్ధంచేశారు. రెగ్యులర్ క్లాసులు పూర్తయిన తరువాత మధ్యాహ్నం 1 గంట నుంచీ 3.30 వరకూ రెమెడియల్ సెషన్స్ కొనసాగిస్తున్నారు.

**సులభతర బోధనకు, బోధనాభ్యసన సామగ్రి పంపిణీ**

ఆంధ్రప్రదేశ్‌లో గ్యారెంటీడ్ ఎఫ్.ఎల్.ఎన్. కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సమగ్ర శిక్ష పాఠశాలలకు, విద్యార్థులకు వివిధ రకాల బోధనా సామగ్రిని (టీఎల్ఎస్) అందజేశాయి. 2025-26 విద్యా సంవత్సరంలో సరఫరా చేసిన వస్తువుల వివరాలు ఇక్కడ ఉన్నాయి:

## విమర్శించడం తప్ప పేర్ని నానికి బందరు ప్రయోజనాలు పట్టవు: కొల్లు రవీంద్ర

అభివృద్ధి పనులను ఎవరైనా అడ్డుకోవాలని చూస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ప్రధానంగా తాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 28 లక్షలతో పనులు చేపడుతున్నామని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో బందరు రూపురేఖలు మారుస్తామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందకుండా చేసిందని, కరగ్రహారం లేఅవుట్ పేరుతో భూములను తక్కువకు కొని ప్రభుత్వానికి ఎక్కువ ధరకు అమ్మి దోచుకున్నారని ఆరోపించారు. ఇనుము దొంగతనంపై పేర్ని నాని చేస్తున్న ఆరోపణలను కొట్టిపారేస్తూ, నిరుపయోగంగా ఉన్న ఇనుమును ప్రజల అవసరాల కోసం వినియోగించడంలో తప్పులేదని మంత్రి స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు 17వ ఎస్ఐపీబీ ఆమోదం

చూడాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వపరంగా ఇవ్వాల్సిన అనుమతుల విషయంలో ఒక్క రోజు కూడా జాప్యం జరగకూడదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అనుమతుల జారీ విషయంలో ఏపీ బ్రాండ్ సృష్టించాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పెట్టుబడులను ఆకర్షించాలంటే ఇతరుల కంటే మనం ఎలా భిన్నమో ఏపీలో అనుమతులు ఎంత సులభతరమో వారికి చెప్పాలని స్పష్టం చేశారు. ఏపీలో ప్రాజెక్టులు రావాలన్న తపన ఉన్న అధికారులను అనుమతులు ఇచ్చే స్థానాల్లో నియమించాలని సూచించారు.

**వన్ ఫ్యామిలీ – వన్ ఎంట్రప్రెన్యూర్‌లో ఎంఎస్ఎంఈలు కీలకం**

సచివాలయంలో జరిగిన 17వ ఎస్ఐపీబీ సమావేశంలో 25 ప్రాజెక్టులకు చెందిన రూ.2,01,023 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 39,067 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "పెట్టుబడుల విషయంలో భారీ పరిశ్రమలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నామో ఎంఎస్ఎంఈలకు అంతే ప్రాధాన్యం ఇవ్వాలి. వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్ విషయంలో ఎంఎస్ఎంఈలు కీలక పాత్ర పోషిస్తాయి. అన్ని పారిశ్రామిక ప్రాంతాలకు గ్యాస్ పైప్ లైన్ అందుబాటులో ఉండేలా మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఫుడ్ ప్రాసెసింగ్ లో రంగంలో రాష్ట్రంలో అపార అవకాశాలు ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుని పెట్టుబడులు గ్రౌండ్ అయ్యేలా చూడాలి. మన రాష్ట్రంలో ఉద్యాన, వాణిజ్య పంట ఉత్పత్తులకు విలువ జోడింపు జరగాలి. ఆయిల్ పాం, మామిడి, కొబ్బరి, కోకో సహా పలు పంటలకు వ్యాల్యూ అడిషన్ ఇస్తే రైతులకు ఎంతో మంచి జరుగుతుంది" అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో సీఎస్ సాయిప్రసాద్, మంత్రులు టీజీ భరత్, అచ్చెన్నాయుడు, సుభాష్, వివిధ శాఖల అధికారులు, వర్చువల్‌గా మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు.

# లోక కళ్యాణం కోసం 'వృక్ష రాజాల' వివాహం

## బద్వేల్‌లో వైభవంగా వేప-మర్రి చెట్ల కళ్యాణ మహోత్సవం

### రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

### పెద్దిరెడ్డి సతీష్‌రెడ్డి

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మే 6)

ప్రపంచ శాంతి వర్ధిల్లాలని, యుద్ధాలు ముగిసిపోవాలని మరియు రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలనే సంకల్పంతో బద్వేల్ సమీపంలోని నందిపల్లి మాధవి ఫామ్ హౌస్ ఒక ఆధ్యాత్మిక వేదికగా మారింది. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మావతి (పద్మావతి హాస్పిటల్), వారి భర్త పెద్దిరెడ్డి సతీష్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో బుధవారం నాడు వేప చెట్టు, మర్రి చెట్టుకు లోక కళ్యాణ మహోత్సవాన్ని వేద పండితులు విష్ణు స్వామి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు.

**శాస్త్రోక్తంగా వేద మంత్రాల సాక్షిగా..**

ఎవేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ ఈ కళ్యాణ ఘట్టం శాస్త్రోక్తంగా సాగింది. హిందూ సంప్రదాయంలో వేప (శక్తి స్వరూపం), మర్రి (శివ స్వరూపం) చెట్ల కళ్యాణం ప్రకృతి ఆరాధనలో భాగమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు, లోక హితానికి చిహ్నమని పండితులు ఈ సందర్భంగా వివరించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ, పూజా కార్యక్రమాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. రాజకీయ, సామాజిక ప్రముఖులు ఈ అపురూప ఘట్టాన్ని వీక్షించేందుకు బద్వేల్ పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.పలువురు రాజకీయ నాయకులు, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని, ప్రకృతి స్వరూపమైన వృక్షాలను దర్శించుకున్నారు. ఆధ్యాత్మిక వాతావరణం: ఫామ్ హౌస్ అంతా ఆధ్యాత్మిక శోభతో నిండిపోయింది. భక్తుల గోవింద నామస్మరణతో ఆ ప్రాంతం మారుమోగింది.

**అన్న ప్రసాద వితరణ**

ఎకళ్యాణోత్సవానికి విచ్చేసిన భక్తులకు, నాయకులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సతీష్ రెడ్డి కుటుంబ సభ్యులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం అనంతరం విచ్చేసిన వారందరికీ ప్రత్యేక అన్న ప్రసాద వితరణ చేపట్టారు. సతీష్ రెడ్డి దంపతులు స్వయంగా అతిథులను గౌరవించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

"ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో యుద్ధాలు ఆగిపోయి, ప్రపంచమంతా శాంతి నెలకొనాలని, ముఖ్యంగా మన రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ లోక కళ్యాణాన్ని సంకల్పించామని డాక్టర్ పద్మావతి, సతీష్‌రెడ్డి దంపతులు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో స్థానిక ప్రజలు, ఆధ్యాత్మిక వేత్తలు డాక్టర్ పద్మావతి దంపతుల సేవా తత్పరతను, భక్తి భావాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రామకోటి రాజు, కటారు రామయ్య, శ్రీకృష్ణ కోలాటం మాస్టర్ వెంకటేశ్వర్లు, సుభాష్, చెన్నారెడ్డి, పిచ్చయ్య యాదవ్, బిజెపి పట్టణ అధ్యక్షులు దర్మిశెట్టి వెంకటసుబ్బయ్య, సంజీవరెడ్డి, పెద్ది సుధాకర్, పలువురు భక్తులు, పద్మావతి హాస్పిటల్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.









ప్రకాశం



మార్కాపురం



బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక

07.05.26 గురువారం


## రెవెన్యూ సమస్యల పరిష్కారం వేగవంతానికి వన్ మంత్ వన్ విలేజ్ కార్యక్రమం అమలు

### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 6)

మార్కాపురం జిల్లాలో ప్రజల రెవెన్యూ సమస్యలను గ్రామ స్థాయిలోనే వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వన్‌మంత్ వన్ విలేజ్ ఫర్ విజిట్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి మండలంలో ప్రతి నెల ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, ఆ గ్రామంలో వరుసగా నాలుగు వారాల పాటు నాలుగు విడతలుగా ప్రత్యేక రెవెన్యూ గ్రామ సందర్శనలు నిర్వహించబడతాయి. గ్రామస్థుల భూ, రెవెన్యూ సంబంధిత సమస్యలను గ్రామంలోనే స్వీకరించి, పరిశీలించి, చట్టబద్ధంగా పరిష్కరించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రత్యేకంగా రీ-సర్వే గ్రామాలు, ఎక్కువ సంఖ్యలో పెండింగ్ రెవెన్యూ ఫిర్యాదులు ఉన్న గ్రామాలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, మండల సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తదితర అధికారులు తప్పనిసరిగా పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి సందర్శనలో ఫిర్యాదుల స్వీకరణ, గ్రామ భూ రికార్డుల పరిశీలన, రెండవ సందర్శనలో ఫీల్డ్ వెరిఫికేషన్, విచారణ, మూడవ సందర్శనలో సమస్యల పరిష్కారం మరియు ఉత్తర్వుల జారీ, నాల్గవ సందర్శనలో గ్రామ సభ (తరువాయి 4లో...)

# చంద్రబాబు నీళ్ళు పారిస్తుంటే జగన్ రక్తం పారిస్తున్నాడు



- వెలిగొండ కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది
- 20 గంటలు వెలిగొండ టన్నెల్స్ లో ఉండి పనులు పరిశీలన
- టన్నెల్‌లో టీబీఎంను పరిశీలించిన మంత్రి నిమ్మల
- కార్మికులు, అధికారులకు, ఏజెన్సీ సిబ్బందికి, భరోసా
- ఉత్తేజాన్ని ఇవ్వడానికే టన్నెల్‌లోకి వెళ్ళాను
- మంత్రి నిమ్మల రామానాయుడు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 6)

సాగునీటి వనరులను సద్వినియోగం చేసుకుని ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు పనుల పర్యవేక్షణ నిమిత్తం మంగళవారం మధ్యాహ్నం వచ్చిన ఆయన బుధవారం మధ్యాహ్నం వరకు ఇక్కడే ఉండి పోయారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలవరం తో సహా రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులు ప్రోగ్రెస్ గురించి వివరించారు. పనులు ఇంత సంక్లిష్టమైపోయి నరకయాతన చవి చూడటానికి ఐదేళ్ల జగన్ అరాచక పాలనే కారణమని ఆయన పేర్కొన్నారు. ఇందుకు వెలిగొండ పెద్ద ఉదాహరణ అని అన్నారు. 3000 కోట్ల రూపాయల పనులు మిగిలి ఉండగా జాతికి అంకితం చేసిన ద్రోహి జగన్ గా ఆయన పేర్కొన్నారు. అయినా ఆయనలో కించిత్తు మార్పు రాకపోగా, రఫా రఫా నరుకుతాం, రక్తం చిందిస్తాం, అంటూ బరితెగించి బాహాటంగానే చెబుతున్నారు. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసే వారు కావాలా? రక్తాన్ని పారించే వాళ్ళు కావాలో ప్రజలు ఆలోచించాలని నిమ్మల ఆవేదన చెందారు. దాదాపు 20గంటలు వెలిగొండ టన్నెల్స్ లోనే ఉండి లైనింగ్, బెంచింగ్, పనులు పరిశీలించిన మంత్రి ఆ పనుల సంక్లిష్టతను, నాటి జగన్ ప్రభుత్వం నిర్వాకాన్ని చూసి చలించి పోయారు. ఈ నేపథ్యంలోనే వారందరితోపాటు మీడియాతో కూడా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మరోసారి చెప్పారు. వెలిగొండ పూర్తి చేసి ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలనే ధృడ సంకల్పంతో చంద్ర బాబు ఉన్నారని మంత్రి చెప్పారు. ఈ కారణంగానే వారం, వారం వెలిగొండ ప్రాజెక్టు పనులపై చంద్రబాబు సమీక్ష నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. తాను పగలు, రాత్రి, టన్నెల్స్‌లోనే ఉండి, 5 గ్యాంట్రీల పనితీరును పరిశీలించానని చెప్పారు. మ్యాన్ పవర్, వెహికల్ మూమెంట్ కోఆర్డినేషన్, కార్మికులు, ఏజెన్సీ ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని వారికి సూచించినట్లు వివరించారు. క్లిష్టమైన టన్నెల్స్‌లో రాత్రింబవళ్ళూ పనిచేస్తున్న కార్మికులు, అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులకు భరోసా కల్పించడానికి, ఉత్తేజాన్ని, విశ్వాశాన్ని పెంచడానికి టన్నెల్స్‌లో గడిపానని అన్నారు. ప్రాజెక్టు అవశ్యకతను కార్మికులు, అధికారులకు తెలియజేయడానికే రాత్రి, పగలు టన్నెల్స్‌లో ఉండి పనులను పరిశీలించానని చెప్పారు. టిబిఎం చిక్కుకున్న చోట 30 మీటర్లు నడిచి వెళ్ళే దారిలో 3 చోట్ల కొండరాళ్ళు ఊడిపడ్డాయి. టన్నెల్2లో 12వ కి.మీ దగ్గర 9.8 మీ వ్యాసం, 175 మీ పొడవు ఉన్న టిబిఎం మిషన్ టన్నెల్‌లో చిక్కుకుపోయిందని (తరువాయి 4లో...)

# అమ్మకానికి బ్యాంకులో కుదవ పెట్టిన బంగారం

### బాధితుడు ఫిర్యాదుతో స్పందించి యాక్సిస్ బ్యాంక్‌లోనే బంగారం బాధితుడికి ఇప్పించిన దళిత నేత నీలం






(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 6)

యాక్సిస్ బ్యాంకులో కుదవ పెట్టిన బంగారంని ఐఐఎఫ్‌లో ఫైనాన్స్‌లో అమ్మకానికి పెట్టిన ఇంటర్నేషనల్ యాక్సిస్ బ్యాంక్. 67 గ్రాముల బంగారం యాక్సిస్ బ్యాంకులో పెట్టి 2 లక్షల 40 వేల రూపాయలు గోల్డ్ లోన్ తీసుకుంటే ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ 7,21,000 వేల రూపాయలు కట్టమని రుబాబు చేస్తున్నారు. బంగారం బాధితుడు ఫిర్యాదుతో స్పందించి యాక్సిస్ బ్యాంక్‌లో నే బంగారం బాధితుడికి దళిత నేత నీలం ఇప్పించారు. ఒంగోలు యాక్సిస్ బ్యాంకు మెయిన్ బ్రాంచ్ లో కుటుంబ అవసరాల కోసం కుదవ పెట్టిన 67 గ్రాముల బంగారాన్ని యాక్సిస్ బ్యాంకు వారు కుదవ పెట్టిన వారికి తెలియకుండానే ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో చట్ట విరుద్ధంగా కుదవ పెట్టుకొని బ్యాంకు చరిత్రలో రికార్డు సృష్టించారని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు తెలిపారు. బుధవారం రామచంద్రన్ బాలసుబ్రమణ్యం అను తమిళనాడుకు చెందిన ఒంగోలు జర్నలిస్ట్ కాలనీలో నివసించే వ్యక్తి తన కుటుంబ అవసరాల కోసం 67 గ్రాముల బంగారాన్ని 2023 వ సంవత్సరం నవంబర్ నెల 30వ తేదీన కొదవ పెట్టి రూ.2,40,400 రుణం తీసుకున్నారు. ఇందుకు గాను బ్యాంకు వడ్డీ రూ.34,740 అయింది. రిజర్వ్ బ్యాంకు నిబంధనల ప్రకారం రెండవ సంవత్సరంలో అసలు, వడ్డీ కలిపి మరల రూ.2,89,000లు అయ్యింది. ఈ రూ.2,89,000 రూపాయలు కి అప్పున్న బంగారాన్ని ఇవ్వ లేదు. అప్పు తీర్చమని నోటీసులు ఇవ్వకుండానే ఇంటర్నేషనల్ యాక్సిస్ బ్యాంకు స్థానికంగా ఉండే ఇండియా ఇన్ఫో లైన్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో ఈ 67 గ్రాముల బంగారాన్ని దారి మళ్లించింది. తమ బంగారం ఇవ్వాలని అమాయకంగా భారతదేశపు బ్యాంకుల పై నమ్మకం ఉన్న బాధితుడు యాక్సిస్ బ్యాంకుకు రాగా ఐఐఎఫెల్‌లో మీ బంగారం ఉంది తెచ్చుకోమన్నారు. బాలసుబ్రమణ్యంకు బ్యాంకు "లీలలు"అర్థం కాక బాధితుడు ఐఐఎఫ్ఎల్‌కు భార్యతో కలసి వెళ్లారు. సదరు ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ వారు రూ.7,21,000 గోల్డ్ లోన్ కట్టి బంగారం తీసుకొని వెళ్ళమని బాలసుబ్రమణ్యం కుటుంబం పై రుబాబు చేశారు. మరలా బాధితుడు తాము బంగారం కుదవ పెట్టుకున్న యాక్సిస్ బ్యాంకు వద్దకు వచ్చి మాకు తెలియకుండా మా బంగారం ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీకి ఎందుకు పంపించారని ప్రశ్నించారు. అంతట బ్యాంకు మేనేజర్ తమకు సంబంధం లేదని గోల్డ్ లోన్లు చూసేది అనుపమ అని తెలిపారు. అనుపమను ప్రశ్నించగా మీకు సమాధానం చెప్పవలసిన అవసరం మాకు లేదన్నారు. మా బ్యాంకులో లోను పెడితే సకాలంలో లోను తీర్చలేదు కాబట్టి మేనేజర్ సూచన మేరకు ప్రైవేట్ ఫైనాన్స్‌లో పెట్టామని బదులిచ్చింది. అంతట బ్యాంకు మేనేజర్ ఫైనాన్స్ కంపెనీ వాళ్ళతో మాట్లాడి వడ్డీ తగ్గించి బంగారం బాధితులకు ఇవ్వాలని కోరారు. నాలుగు లక్షల 15 వేల రూపాయలు ఇస్తేనే బంగారం ఇస్తామని బ్యాంకు వారు సెక్యూరిటీ, బౌన్సర్లతో బాధితులను బెదిరించారు. మరలా బాధితులు యాక్సిస్ బ్యాంక్‌కి రాగా 3 లక్షల 38 వేల రూపాయలు కట్టి బంగారం తీసుకుని వెళ్ళమని చెప్పారు. పది రోజుల నుండి బాలసుబ్రమణ్యం కుటుంబం ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ కంపెనీ చుట్టూ, యాక్సిస్ బ్యాంక్ చుట్టూ కాళ్ల అరిగేలా తిరుగుతున్నారు. యాక్సిస్ బ్యాంకు చేస్తున్న చీటింగ్ విషయాన్ని ఐఐఎఫ్ల్‌లో బంగారం కుదవ పెట్టిన విషయాన్ని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేందర్‌రావు దృష్టికి బాధితుడు మంగళవారం (తరువాయి 4లో...)

# యువతరాన్ని ముందుకు తీసుకొస్తున్న పార్టీ తెలుగుదేశం

### రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి
### పార్టీ కార్యాలయ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న
### ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు



4

# వేసవిలో పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

### ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు
### ఎండ తీవ్రతనుంచి రక్షణ పొందేందుకు
### ట్రాఫిక్ సిబ్బందికి సమ్మర్ వెల్ఫేర్ కిట్లను అందజేత





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 6)

ఎండ తీవ్రతను రక్షణ పొందేందుకు ట్రాఫిక్ సిబ్బందికి సమ్మర్ వెల్ఫేర్ కిట్లను బుధవారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు అందజేశారు. సిబ్బంది సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా వేసవి తాపం నుండి ట్రాఫిక్ సిబ్బంది రక్షణ పొందేందుకు వారికి జిల్లా ఎస్పీ గారు సమ్మర్ వెల్ఫేర్ కిట్లను జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో అందజేశారు. ఈ సమ్మర్ కిట్ లో ఎండ తీవ్రత నుండి కాపాడే హ్యాట్స్, సన్ గ్లాసెస్, ప్యాకెట్లు, వాటర్ బాటిల్‌లు ఉన్నాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నిత్యం ఎండలో (తరువాయి 4లో...)

# చంద్రబాబు నీళ్ళు పారిస్తుంటే జగన్ రక్తం పారిస్తున్నాడు







వివరించారు. టన్నెల్‌లో చిక్కుకున్న టిబిఎం మిషన్ తొలగింపు పై హైకోర్టులో స్టే ఉంటే గత వైసిపి ప్రభుత్వం స్టే తీసేయించే ప్రయత్నం చేయలేదని దుయ్యబట్టారు. చంద్రబాబు అడ్వకేట్ జనరల్ తో మాట్లాడి టిబిఎం తొలగింపు ఆవశ్యకతను వివరించి స్టే తొలగించేటట్లు చేశారన్నారు. టిబిఎం దగ్గరకు మామూలుగా వెళ్లలేమని జెసిబి మీద వెళ్లి పరిస్థితిని పరిశీలించామని మంత్రి చెప్పారు. కష్టపడి లైనింగ్, బెంచింగ్ పనులు పూర్తి చేస్తున్నామన్నారు. అలాగే త్వరలోనే నిర్వాసితులకు రూ.900 కోట్లు అందిచబోతున్నట్లు ఆయన తెలియజేశారు. టన్నెల్స్ నుండి నీళ్ళు తరలించాలంటే టిబిఎం తొలగించాల్సిందేనని అందుకు టిబిఎం మాన్యుఫాక్చరింగ్ కంపెనీతో సంప్రదింపులు చేస్తున్నామని చెప్పారు. వీలైనంత త్వరగా టిబిఎం తొలగించేలా యాక్షన్ ప్లాన్ కోసం షెడ్యూల్ తయారు చేయాలని అధికారులను ఆదేశించి నట్లు ఆయన పేర్కొన్నారు. ఇన్ని సంక్లిష్టమైన పనులతో వెలిగొండ పూర్తవ్వకుండానే జాతికి అంకితం అంటూ మోసం,దగా చేసిన జగన్ అబద్దాలకు, అసత్యాలకు బ్రాండ్ అంబాసిడర్ గా నిలిచాడన్నారు. 22 నెలల్లోనే రాష్ట్రంలో సాగు, తాగు నీరు అందిస్తూ చంద్రబాబు రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తున్నారన్నారు. రూ.3850 కోట్లతో హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేసి, 730 కి.మీ దూరంలోని కుప్పానికి నీరందించిన ఘనత తమదేనన్నారు. సీజన్ మొదలయ్యేలోగా అనకాపల్లి వరకు గోదావరి జలాలు తరలించేలా పోలవరం ఎడమ ప్రధాన కాలువలో క్లిష్టమైన పనులు పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. 2027 పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేసి, గోదావరి జలాలు ఇటు ఉత్తరాంధ్ర, అటు రాయలసీమకు తరలిస్తా మన్నారు. ఉత్తరాంధ్రలో కీలకమైన 11 ప్రాజెక్టులను 2 వేల కోట్లు ఖర్చు చేసి రానున్న రెండేళ్ళలో పూర్తి చేసేలా పనులు చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని 2047 నాటికి అగ్రగామిగా నిలపాలని చంద్రబాబు పని చేస్తుంటే, జగన్ అభివృద్ధికి ఆటంకం కల్గిస్తున్నాడని విమర్శించారు. అంతేకాక పొట్టేళ్లను నరుకుతూ ఆ రక్తాన్ని ఫ్లెక్సీలకు అభిషేకం చేస్తూ ప్రజల్లో భయానికి వాతావరణాన్ని సృష్టిస్తున్నాడని అన్నారు. అందువల్లే ప్రజలే ఆ పార్టీని గొడ్డలి పార్టీగా, గొడ్డలి గుర్తుగా పిలుస్తున్నారని రామానాయుడు అన్నారు. అందువల్ల ప్రజలు నీరు తీసుకొచ్చి సస్యశ్యామలం చేసే వాళ్ళు కావాలో, రక్తపాతం సృష్టించేవాళ్లు కావాలో ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి నిమ్మల రామానాయుడుతో పాటు జలవనురుల శాఖ సలహాదారు ఎం వెంకటేశ్వరరావు, సిఈ రమేష్, ఎస్ఈ అబుతాలేం, ఈఈలు, ఏజెన్సీ ప్రతినిధులు, ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# యువతరాన్ని ముందుకు తీసుకొస్తున్న పార్టీ తెలుగుదేశం

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 6)**

స్వర్గీయ అన్న నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ నీ పార్టీ జాతీయ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో పటిష్టంగా నిర్మించి అన్ని జిల్లా కేంద్రాలలో జిల్లా పార్టీ కార్యాలయాలు ఉండాలనే తలంపుతో ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలులో పార్టీ కార్యాలయాన్ని నిర్మించేందుకు భూమి పూజ కార్యక్రమం చేపట్టడం జరిగిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు అన్నారు. నగరంలోని భాగ్యనగర్ ఏసీబీ కార్యాలయం పక్కన తెలుగుదేశం పార్టీ నూతన భవనానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాంతీయ పార్టీ ఒక పటిష్టమైనదిగా ఉందని, 44 సంవత్సరాల చరిత్రలో యువతరాన్ని ముందుకు తీసుకు వస్తున్న పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. ఆనాడు అన్న నందమూరి తారక రామారావు పార్టీ కార్యాలయాలు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు కార్యాలయాలుగా ఉండాలనే ఉద్దేశంతో



చెప్పేవారని అలాంటి వాటిని ఇప్పుడు రూపకల్పం చేశామని తెలిపారు. జిల్లాలోని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు తన సొంత ఇల్లు లాగా వచ్చి వెళ్లేందుకు సమస్యలు చెప్పుకునేందుకు ఇది ఒక కేంద్రంగా ఉంటుందని ప్రజలందరూ కూడా ఉపయోగించుకోవాలని అన్నారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని వెలిగెత్తి చాటిన అన్న నందమూరి తారకరామారావు స్ఫూర్తితో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఐక్యంగా పార్టీ కార్యాలయం కృషి చేస్తున్నామని అన్నారు దామచర్ల జనార్దన్‌రావు మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం నిర్మించేందుకు భూమిని కేటాయించుకున్నప్పటికీ ఆనాడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రద్దుచేసి తన పార్టీ కార్యాలయాన్ని నిర్మించుకున్నారని మరల తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం స్థలాన్ని కేటాయించి భూమి పూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. త్వరలో కార్యాలయం పూర్తిగా నిర్మాణం చేసుకొని ఈ ఏడాది ప్రారంభోత్సవం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి మారటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూక సాని బాలాజీ, చీరాల, కందుకూరు ఎమ్మెల్యేలు ఎంఎం కొండయ్య, ఇంటూరి నాగేశ్వరరావు, ఇన్‌ఛార్జిలు గూడూరు ఎరిక్షన్ బాబు, గొట్టిపాటి లక్ష్మి, మాజీ మేయర్ గంగాడ సుజాత, గ్రంథాలయ చైర్మన్ ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొటారి నాగేశ్వరరావు, గడ్డం ఆదినారాయణ, పాలపర్తి లక్ష్మి నారాయణ, తంజావూరు శ్రీనివాస్, గోగినేని రామారావు, తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు, మహిళా నాయకులు ఆర్ల వెంకటరత్నం, టి అరుణ, బీరం అరుణరెడ్డి, టి అనంతమ్మ, కుసుమ కుమారి, తమ్మిశెట్టి రమాదేవి, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.



















# వేసవిలో పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు





నిలబడి దుమ్ము, ధూళి లెక్కచేయకుండా ట్రాఫిక్ సిబ్బంది ఎండ తీవ్రతలో కూడా తప్పనిసరిగా విధులు నిర్వహించాల్సి ఉంటుందని, వారికి స్వీయ రక్షణ చాలా అవసరమని, ఎండకు నీరు బాగా తాగాలని, డీహైడ్రేషన్ కాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. వడ దెబ్బ వంటి ప్రమాదకర పరిస్థితులకు లోను కాకుండా నిమ్మ రసం, మజ్జిగ లాంటి ద్రవాలు సేవించాలని, వేసవి కాలంలో అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రవాణా సాఫీగా సాగుటలో ట్రాఫిక్ పోలీసుల పాత్ర అత్యంత కీలకమైనదని, వేసవిలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటూనే ప్రజలకి మెరుగైన సేవలందించాలని, విధి నిర్వహణలో ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమంలో ఎంతో శ్రద్ధ తీసుకుంటూ వేసవిలో సమ్మర్ కిట్ ను అందించిన జిల్లా ఎస్పీకి సిబ్బంది ధన్యవాదాలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ హాజరత్తయ్య, ట్రాఫిక్ ఎస్ఐలు కోటయ్య, శ్రీనివాసులు, మాల్యాద్రి, శివ ప్రసాద్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యల పరిష్కారం వేగవంతానికి వన్ మంత్ వన్ విలేజ్ కార్యక్రమం అమలు

నిర్వహించి పరిష్కరించిన సమస్యల వివరాల ప్రజా ప్రకటన చేపడతారని తెలిపారు. భూ సరిహద్దు వివాదాలు, మార్పిడి సమస్యలు, కుటుంబ భూ వివాదాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, రీ సర్వే సమస్యలు, 22ఏ నిషేధిత ఆస్తుల అంశాలు, దారుల వివాదాలు, తదితర రెవెన్యూ సమస్యలను ప్రాధాన్యతగా పరిష్కరిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాలను "రెవెన్యూ ఫిర్యాదుల రహిత గ్రామాలుగా" తీర్చిదిద్దడం, ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించడం, పెండింగ్ ఫిర్యాదులను తగ్గించడం, ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. జిల్లాలోని ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ రెవెన్యూ సమస్యలను సంబంధిత గ్రామ సందర్శనల సమయంలో అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం నేటి నుంచి (గురువారం) మార్కాపురం జిల్లాలో మొదవుతుందని ఆమె తెలిపారు. ప్రతి మండలానికి ఒక గ్రామం చొప్పున ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

# అమ్మకానికి బ్యాంకులో కుదవ పెట్టిన బంగారం

తీసుకొని వచ్చారు. బుధవారం బాధిత కుటుంబంతో యాక్సిస్ బ్యాంక్ మేనేజర్‌ని కలిసి ఇంటర్నేషనల్ స్థాయి యాక్సిస్ బ్యాంకులో కుదవ పెట్టిన బంగారం ఇండియన్ ఇన్ఫోలైన్ ఫైనాన్స్ కంపెనీకి ఎలా వెళ్లిందని నీలం ప్రశ్నించారు. బంగారం రుణం చెల్లించకపోతే గడువు దాటితే కస్టమర్‌కు మొదట నోటీసులు ఇవ్వాల్సి ఉందన్నారు. దానికి వాళ్లు స్పందించకపోతే వేలం వేస్తున్నామని పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయవలసి ఉందన్నారు. కానీ యాక్సిస్ బ్యాంకులో పెట్టిన బంగారం ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలకు ఎందుకు వెళ్లిందని అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం ప్రభుత్వ బ్యాంకుల్లో 90 పైసలు వడ్డీ తీసుకుంటుంటే బ్యాంకులను నమ్మి రెండు రూపాయలు వడ్డీ అయినా సరే బంగారం తాకట్టు పెట్టేటప్పుడు, తీసుకునేటప్పుడు కూడా అనేక సర్ ఛార్జీలు విధించి కస్టమర్లను మోసం చేసే యాక్సిస్





బ్యాంక్ లూటీ చాలదన్నట్టు, బ్యాంకులో కుదవ పెట్టిన బంగారాన్ని ఫైనాన్స్ కంపెనీలో కొదవ పెట్టి బ్యాంకు కస్టమర్లను చీటింగ్ చేసి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలకు తూట్లు పొడిచిందన్నారు. వెంటనే బ్యాంకు లైసెన్స్ రద్దు చేయాలని నిరసన చేపట్టారు. యాక్సిస్ బ్యాంకు మేనేజర్ కాళ్ల బేరానికి వచ్చి వెంటనే ప్రైవేట్ ఫైనాన్స్‌లో ఉన్న 67 గ్రాములు బంగారాన్ని హుటాహుటిన తెప్పించి బాధిత బాలసుబ్రమణ్యం, జ్యోతి దంపతులకు దళిత నేత నీలం సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, సమతాధల్ కన్వీనర్ మేడికొండ మురళి, పట్రా బంగారం, తదితరులు ఉన్నారు.

# యంవియస్ శాస్త్రికి పుట్టంరాజు విశిష్ట సాహిత్య పురస్కారం ప్రధానం

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 6)**



ప్రతిభావంతులైన యువతను గుర్తించి వారికి అవకాశాలు ఇచ్చి ప్రోత్సహించడం ద్వారా ప్రకాశం జిల్లా సాహిత్య రంగంలో ఒక కొత్త మార్పుకు యువోదయానికి నవోదయానికి అక్షర సాహితీ సమితి అధ్యక్షులు ఎంవిఎస్ శాస్త్రి నాంది పలికారని పలువురు వక్తలు పేర్కొన్నారు. పుట్టంరాజు కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన సాహిత్య కార్యక్రమంలో "పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మల విశిష్ట సాహిత్య పురస్కారం 2026" ను కవి, పండితుడు, అధ్యాపకులు, ఆధ్యాత్మిక వేత్త, పాత్రికేయులు యంవియస్ శాస్త్రికి సభక్తికంగా ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి ట్రస్టు బోర్డ్ చైర్మన్ చుండూరి మురళీ సుధాకర్ అతిథిగా పాల్గొన్నారు. సభాధ్యక్షులు నారాయణం బాల సుబ్రహ్మణ్యంతో పాటు పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా సాహిత్య రంగ వికాసానికి శాస్త్రి చేసిన కృషి చిర స్మరణీయమని కొనియాడారు. ఎం వి ఎస్ శాస్త్రి రచనలు వేటికవే . సరళ సుందరంగా సాగి సమాజానికి ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని ఆయనలోని పాండిత్యం, వినయం యువతకు ఆదర్శమని ప్రశంసించారు. పురస్కార ప్రదాతగా వ్యవహరించిన పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ సాహిత్య సేవ అనేది నిష్కామ సేవ. అక్షరారాధనలో నిమగ్నులై తెలుగు భాషకు సేవ చేస్తున్న శాస్త్రికి ఈ పురస్కారం అందించడం మా ట్రస్టుకు గౌరవకరమని వారి సేవలు మరింత విస్తరించాలని ఆకాక్షించారు. ట్రస్టు పక్షాన పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజలు ఎంవిఎస్ శాస్త్రి, ఉమాదేవి దంపతులకు నగదు పురస్కారంతో పాటు జ్ఞాపికను అందజేశారు. పోలూరి వేంకట శివరామప్రసాదు, సుబ్బమ్మ పురస్కారగ్రహీతకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పుస్తక పరిచయాలు నిర్వహించగా, పోలూరి వెంకట శివరామ ప్రసాద్ మాట్లాడుతూ శాస్త్రి రచనలు భావ గాంభీర్యంతో పాటు సరళతను కలగలిపినవిగా ఉంటాయన్నారు. వారణాసి రఘురామశర్మ శాస్త్రి రచనలు పరిశోధనాత్మక దృష్టిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గాడేపల్లి దివాకర దత్తు సామాజిక చైతన్యానికి శాస్త్రి సాహిత్యం పునాది వేస్తోంది అన్నారు. డివియం సత్యనారాయణ గాంధేయవాదాన్ని సాహిత్యంలో ప్రతిబింబింపజేసిన రచయితల్లో శాస్త్రి ప్రముఖులు అన్నారు. ఆర్వి రాఘవరావు శాస్త్రి రచనలు తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. సాహితీ కౌముది, అద్దంకి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీ కౌముది సభ్యులు కెవి పోలిరెడ్డి, నిమ్మరాజు నాగేశ్వరరావు, పెండ్యాల అంకయ్య, కందికంటి సత్యం, చప్పిడి వీరయ్య, మలాది శ్రీనివాసరావు, కె కుమార్, యు రాజశేఖర్, వినుకొండ సుధాకర్, వై త్యాగరాజు, కొప్పరపు శ్రీనివాసరావు, ప్రభృతులు పాల్గొన్నారు. పురస్కార గ్రహీత ఎంవిఎస్ శాస్త్రి కార్యక్రమ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# గుండ్ల సముద్రం, చిమట సచివాలయుల అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో కిశోరీ వికాసం పై అవగాహన సదస్సులు





**(షణ్ముఖ వెలుగు, మద్రిపూడి, మే 6)**

మండలంలోని గుండ్లసముద్రం, చిమట సచివాలయల అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో బుధవారం కౌమార బాల బాలికల సాధికార వైపు పయనం చేయాలని ప్రత్యేక వేసవి శిబిరాల కార్యక్రమంలో ఆయా పరిధిలోని సచివాలయం అధికారులు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా అభివృద్ధి, సంక్షేమ శాఖ ద్వారా వివిధ శాఖల సమన్వయంతో జరుగుతున్న ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. పలువురు అంగన్వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధ చట్టం, టీనేజ్ ప్రెగ్నెన్సీ పై అవగాహన కలిగి ఉండాలని కోరారు. బూతు పరిశుభ్రత, లైంగిక పునరుత్పత్తి ఆరోగ్యం పై కూడా జాగ్రత్తలు పాటించాలని అంగన్వాడి కార్యకర్తలు సూచించారు. ఈ ప్రయాణంలో ఎప్పుడు ఎలాంటి అవసరత ఏర్పడితే వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్లకు 112, 181, 1098 వెంటనే కాల్ చేస్తే పరిష్కార మార్గం చూపుతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ వెంకటరమణ, శ్రీలక్ష్మి, రాధా, జ్యోతి, ఎస్తేరు రాణి, స్వాతి, కోరికమ్మ, అరుణ, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మార్కాపురం జిల్లా డీఆర్ఓ (ఎఫ్ఏసి)గా బాధ్యతలు చేపట్టిన ఎం వెంకట శివరామిరెడ్డి







**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 6)**

మార్కాపురం జిల్లా నూతన డిఆర్ఓ (ఎఫ్ఏసి)గా ఎం వెంకట శివరామిరెడ్డి బుధవారం కలెక్టరేట్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రెవిన్యూ అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. ఇప్పటివరకు ఆయన ఎస్‌డీసి (కంభం), ఇన్చార్జి కనిగిరి ఆర్డీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు డీపీఆర్వో మోహన్ రాజు, ఏఓ రవీంద్రారెడ్డి, తహసిల్దార్ చిరంజీవి, ఇతర రెవెన్యూ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

# టిడిపి నూతన కార్యాలయానికి శంకుస్థాపన

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 6)**





నాలుగున్న దశాబ్దాల ఘన చరిత్ర కలిగిన తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో సొంత పార్టీ కార్యాలయ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా బుధవారం పట్టణంలోని భాగ్యనగర్‌లో పార్టీ ఆఫీస్ భవనానికి ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అట్టహాసంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న టీడీపీ పార్టీకి జిల్లా కేంద్రంలో ఇప్పటివరకు సొంత ఆఫీస్ లేదని, ఇక నుంచి అటువంటి ఇబ్బందులు లేకుండా శాశ్వితంగా భవన నిర్మాణం జరగడం శుభ పరిణామమని అన్నారు. ఈ భవన నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తి చేసి పార్టీ కార్యకలాపాలను కొనసాగించుకోవాలని ఆయన అన్నారు. పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ నాలుగున్నర దశాబ్దాల చరిత్ర కలిగిన పార్టీకి ఆఫీస్ కార్యాలయానికి నేడు తొలి అడుగులు దిద్దడం మన అదృష్టమని అన్నారు. ఒంగోలు పార్లమెంటు పార్టీ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ తన హయంలో పార్టీ భవనానికి శంకుస్థాపన జరగడం చారిత్రక ఘట్టమన్నారు. పార్టీ పరిశీలకులు శాసనాల వీరబ్రహ్మం మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆరాధ్య దైవం స్వర్గీయ ఎన్‌టి రామారావు చేతుల మీదుగా స్థాపించిన టిడిపి ఆఫీస్ కు శంకుస్థాపన జరగడం పండుగ రోజుగా భావిస్తున్నామని అన్నారు. పేద ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న మహోన్నత నేత స్వర్గీయ ఎన్ టి రామారావు స్థాపించిన టిడిపిని మరింత బలోపేతం కావాలని శాసనాల వీరబ్రహ్మం అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, ఏపి టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ నుకసాని బాలాజీ, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, దర్శి, యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు గొట్టిపాటి లక్ష్మి, గూడూరి ఎరిక్షన్ బాబు, పార్టీ రాష్ట్ర పరిశీలకులు శాసనాల వీరబ్రహ్మం, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అలయ పూర్వ చరిత్రను ప్రతిబింబించేలా నిర్మాణం జరగాలి

## ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

## ఆలయ నమునా 3డి షార్ట్ ఫిలింను అవిష్కరించిన ఎమ్మెల్యే ఏలూరి

**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, మే 6)**

సీతారాముల అలయ పూర్వ చరిత్రను ప్రతిబింబించేలా అద్భుతమైన ఆలయాన్ని నిర్మించి నేటి తరానికి తెలియజేసేలా ఓ కళాఖండాన్ని అందించాలని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సంబశివరావు సీతారామాలయ అభివృద్ధి కమిటీకి సూచించారు. అన్నపూర్ణ థియేటర్ పక్కన శ్రీ సీతారామాలయ పునర్నిర్మాణంలో భాగంగా కొత్తగా నిర్మాణం జరుగుతున్న అలయ నమూనా, నిర్మాణం శైలి, ఆలయ పూర్తి 3డి షార్ట్ ఫిలింను బుధవారం అలయ ధర్మకర్త మోటుమర్రి రామసుబ్బారావు,అలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు సమక్షంలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సంబశివరావు శుభహస్తాలతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అలయ ధర్మకర్త మోటుమర్రి రామసుబ్బారావు మాట్లాడుతూ అలయనికి అవసరమైన 27 లక్షల రూపాయల మూలధనన్ని ఎమ్మెల్యే ఏలూరి కృషితో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నీధులు విడుదల చేసిన సందర్భంగా కమిటీ మరియు గ్రామ పెద్దలు అందరం కృతజ్ఞతలు తెలియాజేయనున్నట్లు తెలిపారు.అలాగే అలయం అయోధ్యలో రామ మందిర నిర్మాణ శైలిలో నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అలయ ధర్మకర్త మోటుమర్రి రామసుబ్బారావు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వలివేటి రామానుజం, కోంద్రగుంట శ్రీహరిబాబు, నక్కల వీరరాఘవలు, వలివేటి విశ్వనాథ బాబు, నరహరి శ్రీనివాసరావు, సందు శ్రీనివాసరావు, తుమ్మలపెంట జయరావు, భయ్యా ప్రసాద్, వలివేటి లక్ష్మీ కుమార్, మోటమర్రి శ్రీనివాసరావు, మోటుమర్రి లోకేష్, కోమట్ల గణేష్ రెడ్డి, భయ్యా సతీష్, తదితరులు పాల్గొన్నారు.





## రాయితీతో వ్యవసాయ పనిముట్లు

### మండల వ్యవసాయధికారి డి విజయ కుమార్



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 6)

మండలంలోని రైతులకు వ్యవసాయ యాంత్రికరణ 2025-26 ప్రభుత్వ ఉత్తర్వుల గురించి మండల వ్యవసాయధికారి డి విజయ కుమార్ తెలియజేసారు. అందులో భాగంగా వ్యవసాయ శాఖ నుండి ప్రభుత్వం ద్వారా ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు, మహిళలకు 50 శాతం రాయితీ, ఇతర రైతులకు 40% రాయితీతో వ్యవసాయ పనిముట్లు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ప్రత్యేక వెబ్ అప్లికేషన్ ద్వారా ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. మీ రైతు సేవా కేంద్రం వద్ద వివరాలు తెలిపి అప్లికేషన్ చేసుకోవచ్చని తెలిపారు. వ్యవసాయ యంత్రాలను 9 వర్గాలుగా ప్రతిపాదించడం జరిగిందన్నారు. అర్హత ప్రమాణాలు వ్యవసాయ భూమి ఉన్న రైతులు, కౌలు పొందిన రైతులు చేసుకోవచ్చున్నారు. 3 సంవత్సరాలలో 3 సీజన్‌లో పంట నమోదు చేసుకొని ఉండాలన్నారు. ఒక కుటుంబంకు ఒక యంత్రం మాత్రమే ఇవ్వబడుతుందన్నారు. రైతులు దరఖాస్తును 5.5.2026 నుండి 19.05.2026 లోపే నమోదు చేసుకోవాలన్నారు. 23.05.2026 నుండి 25.05.2026 తేదీలో దరఖాస్తు చేసిన లబ్ధిదారులను లాటరీ ప్రక్రియ విధానంలో ఎంపిక చేయబడుతుందన్నారు. కావున మండలంలో వ్యవసాయ పనిముట్లు కావలసిన రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

## స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయం ప్రారంభం

### ప్రారంభించిన టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు



(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, మే 6)

మండలంలోని వెల్లంపల్లి గ్రామంలోని స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు కార్యాలయాన్ని వైపాలెం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ ప్రారంభించారు. ఆయనకు గ్రామంలోని నాయకులు అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సచివాలయం వద్ద ఉన్న శిలాఫలకానికి వున్న ముసుగును తొలగించారు. ముఖద్వారం వద్ద నాయకులు అధికారులు కొబ్బరికాయలు కొట్టి గూడూరి ఎరిక్షన్ బాబు, మండల తహసిల్దార్ విజయ భాస్కర్ రిబ్బన్ కట్ చేసి స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాన్ని ప్రారంభించారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు. ఆయన వెంట ఎంపిడిఓ మురళి, ఏపీఓ సుజాత, మండల కన్వీనర్ వలరాజు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ చౌదరి, డిస్ట్రిబ్యూషన్ కమిటీ చైర్మన్ చలమయ్య, సొసైటీ ప్రెసిడెంట్ గుత్తా వెంకట నారాయణ, అల్లూరురెడ్డి, శ్రీనివాసరెడ్డి, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కల్వర్ట్‌కు మరమ్మతులు రాకపోకలు కొనసాగింపు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 6)

మండల పరిధిలోని కరేడు గ్రామంలో బుధవారం ఉదయం అంకమ్మ తల్లి గుడి వెనకాల ఫస్ట్ కల్వర్టులో పెద్ద హోల్ పడింది. ఈ జరిగిన ఇబ్బందికి ఉదయాన్నే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. తక్షణ స్పందించిన ఎమ్మెల్యే ప్రజలకు రాకపోకలకు



ఇబ్బంది రాకుండా చూడవలసిందిగా అధికారులకు నాయకులకు ఆదేశించడమైనది. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేవిధంగా తాత్కాలిక పనులతో రాకపోకలు కొనసాగించడం అయినది. ప్రజల సమస్యను గుర్తించి తక్షణం స్పందించి ఆదేశాలు ఇచ్చినటువంటి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావుని గ్రామ ప్రజలు అభినందించి ధన్యవాదాలు తెలియజేశారు.

# కుటుంబ సంక్షేమ పథకం పై పాలకమండలి బోర్డు డైరెక్టర్ల సమావేశం








(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 6)

యుటిఎఫ్ ఉమ్మడి ప్రకాశం జిల్లా కుటుంబ సంక్షేమ పథకం పాలకమండలి బోర్డు డైరెక్టర్ల సమావేశం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కొమ్ముజు శ్రీనివాసరావు మాట్లాడుతూ కుటుంబ సంక్షేమ బోర్డు డైరెక్టర్ మండలాలలో కీలకంగా వ్యవహరించి క్రొత్త సభ్యులను చేసుకోవాలన్నారు. అదే విధంగా బకాయిలను కూడా వసూలు చేసి కుటుంబ సంక్షేమ పథకం అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ పాలక మండలి సభ్యుల సమావేశం రిపోర్టును జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ హై ప్రవేశి పెట్టారు. ఈ బోర్డు డైరెక్టర్ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి ఎస్ రవి, మార్కాపురం జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ఖాజా రహమతుల్లా, ఓవి వీరారెడ్డి, ప్రకాశం జిల్లా అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు, బాపట్ల ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆర్థిక నివేదికను ట్రెజరర్ సుద్ద పల్లి ప్రసాద్ ప్రవేశపెట్టారు. ఈ పాలక మండలి సమావేశంలో కొత్తగా



కుటుంబ సంక్షేమం పథకంలో చేరిన 46 మంది సభ్యులకు ఆమోదం తెలియజేశారు. మొదటి వాయిదాలో చనిపోయిన ఐదు మంది సభ్యులకు రూ.10 లక్షల సంక్షేమ నిధికి ఆమోదం తెలిపారు. జిల్లాలు వేరు అయినప్పటికీ మార్కాపురంలోని 22 మండలాలు, ప్రకాశం జిల్లాలో లోని 28 మండలాలు, బాపట్ల జిల్లాలోని 9 మండలాలు మొత్తం 59 మండల శాఖలు కలిసి ఉమ్మడి గానే కుటుంబ సంక్షేమ పథకాన్ని కొనసాగిద్దామని నిర్ణయించారు. ఈ సమావేశంలో మన కుటుంబ సంక్షేమ పథకంలో సభ్యులు అయి ఉండి ఇతర సంఘాల్లో పనిచేస్తున్న వంటి వారిని తొలగించడం జరిగింది. ఈ సమావేశంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కుటుంబ సంక్షేమ పథకం కార్యదర్శిగా ఎన్ చిన్న స్వామి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగిశది. ఈ సమావేశంలో జిల్లా సహాధ్యక్షుడు వై వెంకట్రావు, మార్కాపురం జిల్లా సహాధ్యక్షుడు పి బాల వెంకటేశ్వర్లు, ఈ రోశయ్య కె రమేష్ బాబు, ఎస్ జాలయ్య ఆవుల పెద్దబ్బాయి, షేక్ హుస్సేన్ కొప్పర్తి శ్రీనివాసులు, జె వెంకట్రావు, ఎంఎం సుధాకర్‌రావు, కే మల్లారెడ్డి, జి రామకృష్ణ, జిల్లా సిపిఎస్ కన్వీనర్ నారాయణ,

# మహిళలు, చిన్నారుల భద్రతకు కట్టుదిట్టమైన కవచం

## ఒంగోలు వన్ టౌన్ సీఐ ఆధ్వర్యంలో గాంధీ పార్క్‌లో అవగాహన సదస్సు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 6)

మహిళలు, చిన్నారుల రక్షణతో పాటు సమాజంలో పెరుగుతున్న సామాజిక నేరాలను నిర్మూలించడమే లక్ష్యంగా ఒంగోలు వన్ టౌన్ సీఐ ఆధ్వర్యంలో గాంధీ పార్క్‌లో విస్తృత స్థాయిలో అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. మహిళా పోలీసు సిబ్బంది సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు భద్రతా చైతన్యం కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, చిన్నారుల రక్షణకు సంబంధించిన చట్టాలు, ముఖ్యంగా పోక్సో యాక్ట్ గురించి వివరంగా అవగాహన కల్పించారు. పిల్లలపై దాడులు, వేధింపులు వంటి సంఘటనలను తక్షణమే పోలీసులకు తెలియజేయాల్సిన అవసరాన్ని స్పష్టంగా తెలియజేశారు. అదేవిధంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ప్రమాదాలు, బెట్టింగ్ వంటి అక్రమ కార్యకలాపాల ప్రభావం, సైబర్ నేరాల పెరుగుతున్న ముప్పు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు మార్గదర్శకాలు అందించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మంచి అలవాట్లు అలవరచుకోవాలని సూచించారు. మహిళల భద్రత కోసం అందుబాటులో ఉన్న రాష్ట్రునిస్త్రఅ ాజూజూ వినియోగంపై ప్రత్యేకంగా వివరించి, అత్యవసర పరిస్థితుల్లో యాప్ ద్వారా వెంటనే పోలీసులను సంప్రదించవచ్చని తెలియజేశారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తమ బాధ్యతగా భావించాలన్నారు. విద్య ప్రాముఖ్యతను వివరించి, తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఈ అవగాహన సదస్సు ద్వారా సమాజంలో చైతన్యం పెంపొందించి, నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడమే ముఖ్య ఉద్దేశమని పోలీసులు తెలిపారు. సమాజం మొత్తం కలిసి పనిచేస్తేనే మహిళలు, పిల్లలు సురక్షితంగా ఉండగలరని పేర్కొన్నారు.





# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

## అర్హులైన రైతులు వ్యవసాయ యంత్ర పరికరాల కోసం దరఖాస్తులు చేసుకోండి

### మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

(షణ్ముఖ వెలుగు, కొండపి, మే 6)

నియోజకవర్గంలోని అర్హులైన రైతులు వ్యవసాయ యంత్ర పరికరాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. వ్యవసాయశాఖ ఎస్ఎంఏఎం స్కీమ్ క్రింద 2026-27 సంవత్సరానికి వ్యవసాయ యంత్ర పరికరాలకు కొండపి నియోజకవర్గానికి మొత్తం రూ.88.14 లక్షలు మంజూరు అయ్యాయాని మంత్రి తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు మే నెల 19 వ తేదీ లోపల ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలలన్నారు. రైతుల సంక్షేమమే ద్వేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు టెక్నాలజీని ఉపయోగించి రైతులకు అండగా ఉంటున్నామని మంత్రి స్వామి అన్నారు.

# ఎమ్మెల్యే ఏలూరి కృషి ఫలితం

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, మే 6)

## పర్చూరులో 24 దేవాలయాల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
## టీటీడీ శ్రీవాణి ట్రస్టు నిధులు రూ.4.30 కోట్లు
## ఏ కేటగిరిలో 5, సీ కేటగిరిలో 19 దేవాలయాలకు అనుమతి

పర్చూరు నియోజకవర్గంలో దేవాలయాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టీటీడీ శ్రీవాణి ట్రస్టు నిధులతో 24 దేవాలయాల నిర్మాణానికి ఎండోమెంట్స్ శాఖ పరిపాలన అనుమతులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించగా, భక్తుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నిరంతర కృషి ఫలితంగా రాష్ట్రంలోనే పర్చూరు నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలు, పలు గ్రామాల్లో దేవాలయాల నిర్మాణానికి అనుమతులు లభించాయి. మొత్తం రూ.4.30 కోట్ల వ్యయంతో పనులు చేపట్టనున్నారు.ప్రభుత్వం నిర్ణయించిన విధంగా టైప్-ఏ కింద రూ.10 లక్షలు, టైప్-బీ కింద రూ.15 లక్షలు, టైప్-సీ కింద రూ.20 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. ఇందులో భాగంగా పర్చూరు నియోజకవర్గంలో ఏ కేటగిరిలో ఐదు దేవాలయాలు, సీ కేటగిరిలో 19 దేవాలయాల నిర్మాణానికి ఆమోదం లభించింది. ఈ నిధులతో రాయి విగ్రహాలు, పన్నులు, ఇతర అవసరాల ఖర్చులు నిర్వహించవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పనులను ఆమోదిత ప్రణాళికల ప్రకారం చేపట్టి ఒక సంవత్సరం లోపు పూర్తి చేయాలని ఎండోమెంట్స్ శాఖ స్పష్టం చేసింది. పనుల పురోగతిని ఆధారంగా చేసుకుని నిధులను విడతల వారీగా విడుదల చేస్తారని తెలిపింది. నిధుల విడుదల కోసం చెక్‌స్లిప్, యుటిలైజేషన్ సర్టిఫికేట్, ఎం.బుక్ ఎక్స్‌ట్రాక్ట్‌తో పాటు జీపీఎస్ ఫోటోలు సమర్పించడం తప్పనిసరి అని అధికారులు పేర్కొన్నారు. ఇంజినీరింగ్, శిల్పి సిబ్బంది పనులను తరచూ పరిశీలిస్తూ ప్రతి 15 రోజులకు ఒక సారి పురోగతి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అలాగే ఈ పనుల కోసం ప్రత్యేక బ్యాంకు ఖాతాలు నిర్వహించాలని సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ గ్రామాల్లో భక్తి వాతావరణాన్ని పెంపొందించడమే లక్ష్యమని, దేవాలయాల నిర్మాణం ద్వారా గ్రామాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. పనులను త్వరలో ప్రారంభించి నిర్ణీత గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.




### ఏ కేటగిరిలో దేవాలయాలు ఇలా...

ఏ కేటగిరిలో ఒక్కో దేవాలయం నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేయనున్నారు. వాటిలో కారంచేడు మండలం ఆదిపూడి బీసీ కాలనీలో శ్రీ రామాలయం, పర్చూరు మండలం చెరుకూరు బీసీ కాలనీలో శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయం, మార్టూరు వలపర్ల పంచాయతీ పరిధిలోని ద్వారకాపాడు బీసీ కాలనీలో శ్రీ కృష్ణ స్వామి ఆలయం, ఇంకొల్లు మండలం కొనికి బీసీ కాలనీలో శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయం, చిన్నగంజాం మండలం కడవకుదురు ఎస్టి కాలనీలో శ్రీ కోదండరామ స్వామి ఆలయాల నిర్మాణానికి అనుమతులు లభించాయి.

### సి కేటగిరీలో 19 దేవాలయాలు....

సి కేటగిరిలో ఒక్కో దేవాలయానికి 20 లక్షలు ప్రభుత్వం మంజూరు చేయనుంది.కారంచేడు మండలం స్వర్ణపాలెం బీసీ కాలనీలో శ్రీ అంకమ్మ అమ్మవారి ఆలయం, మార్టూరు మండలం కొనంకి ఎస్సీ కాలనీలో శ్రీ నిదానంపాటి లక్ష్మీ అమ్మవారి ఆలయం, ఇంకొల్లు మండలం పావులూరు బీసీ కాలనీలో శ్రీ గంగమ్మ ఆలయం, ఇంకొల్లు మండలం నాగండ్ల ఎస్టి కాలనీలో శ్రీ పోలేరమ్మ అమ్మవారి ఆలయం నిర్మించనున్నారు. అలాగే మార్టూరు మండలం ఇసుకదర్శి బీసీ కాలనీలో శ్రీ గంగా పార్వతి సమేత నాగ మల్లేశ్వర స్వామి ఆలయం, పర్చూరు మండలం వీరన్నపాలెం బీసీ కాలనీలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం, మార్టూరులో బీసీ కాలనీ నిదానంపాటి అమ్మవారి టెంపుల్, తాటివారిపాలెం బీసీ కాలనీలో నీలంపాటి లక్ష్మీ అమ్మవారు, కారంచేడు మండలం జరుబులవారిపాలెం బిసి కాలనీ శ్రీ వెంకటేశ్వర స్వామి టెంపుల్, యద్దనపూడి సూరవరపుపల్లి బీసీ కాలనీలో అంకమ్మ పురం తల్లి టెంపుల్ , వింజనంపాడు బీసీ కాలనీలో వెంకటేశ్వర స్వామి టెంపుల్ , అనంతవరం బీసీ కాలనీలో అంకమ్మ తల్లి దేవాలయం, చిమటవారి పాలెం బీసీ కాలనీలో శివాలయం,పర్చూరు మండలం ఇనగల్లు బీసీ కాలనీలో వెంకటేశ్వర స్వామి టెంపుల్, చిన్నగంజాం మండలంలో పదమరపల్లె బీసీ కాలనీలో రామాలయం, అడివీధిపాలెం బీసీ కాలనీ రామాలయం, పాతగొల్లపాలెం బీసీ కాలనీ పోలేరమ్మ తల్లి ఆలయం, ఏటి మొగ బీసీ కాలనీ పోలేరమ్మ తల్లి ఆలయం, రామచంద్రయ్య నగర్ బీసీ కాలనీలో రామాలయం, తదితర గ్రామాల్లో వివిధ దేవాలయాల నిర్మాణం చేపట్టనున్నారు.




# గంజాయి రహిత సమాజమే లక్ష్యం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 6)

యువత భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తున్న గంజాయి మహమ్మారి పై ప్రకాశం జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా గంజాయి నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం టాస్క్ ఫోర్స్ సీఐ భీమా నాయక్ పర్యవేక్షణలో ఏఎస్ఐ మహబూబ్ బాషా, ఈగల్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది కలిసి ఒంగోలు తాలూకా పరిధిలోని పెళ్లూరు గ్రామంలో గంజాయి వినియోగం, అక్రమ రవాణా వల్ల కలిగే అనర్థాలు, శిక్షల పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మహబూబ్ బాషా గంజాయి వాడకం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, సామాజిక ఇబ్బందులు, చట్టపరమైన చర్యల గురించి వివరించారు. ముఖ్యంగా యువత ఇటువంటి వ్యసనాలకు దూరంగా ఉండి, బంగారు భవిష్యత్ వైపు అడుగులు వేయాలని సూచించారు. గ్రామంలో ఎక్కడైనా గంజాయి సాగు, అమ్మకం లేదా నిల్వ ఉన్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# జెయంబి చర్చి వ్యవహారాల పై జిల్లా రిజిస్టర్


## చట్ట వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారు

## జెఎంబి చర్చి కమిటీ సెక్రటరీ యాదాల రాజశేఖర్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 6)

జెయంబి చర్చి వ్యవహారాల పట్ల జిల్లా రిజిస్టర్ చట్ట వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని జెఎంబి చర్చి కమిటీ సెక్రటరీ యాదాల రాజశేఖర్ ఆరోపించారు. ఒంగోలులోని జెఎంబి చర్చి నందు జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1965 సంవత్సరంలో అప్పటి రిజిస్టర్ చర్చికి సంబంధించి బైలాను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. నాటి నుంచి నేటి వరకు బైలాకు అనుగుణంగా చర్చి కార్యాకలాపాలు కొనసాగిస్తున్నట్లు తెలియజేశారు. 2024వ సంవత్సరంలో కమిటీలో ఖాళీ అయిన రెండు స్థానాలలో ఎన్నికలు జరిపేందుకు నోటిఫికేషన్ జారీ చేయగా కొంతమంది సభ్యులు వ్యతిరేకిస్తూ కోర్టుని ఆశ్రయించడంతో ఎన్నిక వాయిదా పడిందని అన్నారు. బైలా ప్రకారం ఖాళీగా ఉన్న స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉన్న జిల్లా రిజిస్ట్రార్ అందుకు భిన్నంగా కమిటీ మొత్తానికి ఎన్నికలు జరుపుతామని మాట్లాడడం పట్ల అనుమానాల వ్యక్తం అవుతున్నాయి అని అన్నారు.పూర్తి స్థాయిలో కమిటీని రద్దు చేసే అధికారం జిల్లా రిజిస్టర్ కు లేదని హెచ్చరించారు. జె యం బి చర్చి నందు ఒంగోలు ప్రాంత ప్రజలే సభ్యులుగా ఉండాల తప్ప ఇతర ప్రాంతాలు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉండటానికి వీలు లేదన్న విషయం మరిచి జిల్లా రిజిస్ట్రార్ వ్యవహరించారని ఆరోపించారు. ఆయన వ్యవహార శైలి పట్ల ఉన్నత అధికారులకు పిర్యాదు చేయడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం అని తెలియజేశారు. కార్యక్రమంలో ట్రెజరర్ జగజ్జీవన్‌రావుతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





# కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహణ

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, మే 6)

బాలికలు, మహిళల ఉజ్వల్ భవిష్యత్తుకు కిశోరి వికాసం కార్యక్రమం ఎంతోగానో దోహపడుతుందని అంగన్వాడీ కార్యకర్తలు రేణుకదేవి, గాయత్రీ అన్నారు. మండలంలోని మున్నంవారిపాలెం ప్రాధమిక పాఠశాల అవరణలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కిషోర బాలికలు ఎదుర్కొనే ఇబ్బందులు, అడపిల్లల ఉజ్వలమైన ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు తీసుకోవలసిన జాగ్రత్తలు, బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు

# మహానాడు 2026 భూమిపూజలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 6)

తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు ప్రతిఏటా ఘనంగా జరుపుకునే మహానాడు - 2026 పండుగ ఈ నెల 27, 28, 29 తేదీల్లో నెల్లూరు జిల్లా కొడవలూరు మండలంలో జాతీయ రహదారి పక్కన కిసాన్ సెజ్ ప్రాంగణంలో జరగబోతోంది. మహానాడు వేదిక, ఇతర పనులకు సంబంధించిన భూమిపూజ కార్యక్రమం బుధవారం జరిగింది. నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు బీద రవిచంద్ర ,ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి నారాయణ, సహచర ఎమ్మెల్యేలతో కలిసి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులంతా ఒకరినొకరు సమన్వయం చేసుకుంటూ ఐకమత్యంతో, మహానాడును దిగ్విజయంగా నిర్వహిస్తామని వెల్లడించారు. కందుకూరు నియోజకవర్గం నుంచి వేలసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేస్తామని చెప్పారు.

# గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు







(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 6)

ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా బుధవారం విద్యార్థులతో ముందుగా నీతి కథలు జాతీయ నాయకుల జీవిత చరిత్రలు మొదలగు పుస్తకాలు చదివించి అనంతరం పిల్లల మానసిక ఆనందం కోసం కళ్ళగంతలాట అనే ఆటను ఆడిపించడం జరిగింది. నిన్న సమ్మర్ క్యాంప్ చూసి స్పందించి విద్యార్థులకు స్నాక్స్ అందించిన శ్రీ పొత్తూరి సాయిరామ్ ( సాఫ్ట్ వేర్ ) వారి అన్న పొత్తూరి శ్రీనివాసులు సాఫ్ట్ వేర్ ఉద్యోగి నిన్నటి లాగే చదువుతున్న పిల్లలను చూసి స్పందించి విద్యార్థులకు స్నాక్స్ అండ్ డ్రింక్స్ అందించి పిల్లల ప్రేమకు పాత్రులయ్యారు. పొత్తూరి అన్నదమ్ములిద్దరికీ గ్రంథ పాలకుడు హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి మొత్తం 32 మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథాలయ పాలకుడు డి కోటేశ్వరరావు తెలియజేశారు.

## విద్యార్థులకు చిత్రలేఖనంలో పోటీలు



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, మే 6)

బుధవారం చిన్నగంజాం శాఖా గ్రంధాలయం నందు గ్రంథపాలకుడు అలహరి.మోహన్ లక్ష్మీనరసింహ చార్యు లు ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్‌లు వై రామాంజనేయులు, పి శ్రీనివాసరావు పర్యవేక్షణలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనంలో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 31మంది విద్యార్థులు పాల్గొనగా రిసోర్స్ పర్సన్‌లుగా వై రామాంజనేయులు, పి శ్రీనివాసరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు అలహరి మోహన్ లక్ష్మీనరసింహ చార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోండి

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 6)

వ్యవసాయశాఖలో ఎస్ఎంఏఎం స్కీమ్ క్రింద 2025-26 సంవత్సరానికి వ్యక్తిగత వ్యవసాయ యంత్రపరికరాలకు సంబంధించి వ్యకగత నాగల్లు, స్ప్రేయర్లు, విత్తన గొర్రు, నూర్పిడు యంత్రాలు మొదలగు పరికరాలు గాను మొత్తం రూ.15.34 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. సన్న, చిన్న కారు, మహిళా రైతులకు 50% శాతం రాయితీ, 5 ఎకరాలు పై బడి వున్న పెద్ద రైతులకు 40% శాతం రాయితీ ఉందని మండల వ్యవసాయ అధికారి వి రాము తెలియజేసారు. అర్హులైన రైతులు మే నెల 19 వ తేదీ లోపల మీ సంబంధిత రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని తెలియజేసారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సెంచరీ ప్లైవుడ్ వద్ద ఆటో ప్రమాదం

### ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



(షణ్ముఖ వెలుగు, గోపవరం, మే 6)

మండలంలోని సెంచరీ ప్లైవుడ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే, కడప పట్టణానికి చెందిన లక్ష్మీదేవి(34), పెంచలమ్మతో పాటు మరో ఇద్దరు మహిళలు పెంచలకోనలోని నరసింహ స్వామిని దర్శించుకునేందుకు ఆటోను అద్దెకు తీసుకుని వెళ్లారు. దర్శనం ముగించుకుని తిరుగు ప్రయాణంలో సెంచరీ ప్లైవుడ్ సమీపంలో ఉన్న కల్వర్టు వద్ద వాహన నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన డివైడర్‌ను ఆటో డ్రైవర్ గమనించక వేగంగా వచ్చిన ఆటో అదుపు తప్పడంతో ప్రయాణికులు రోడ్డుపై ఎగిరి పడిపోయారు. ఈ ఘటనలో లక్ష్మీదేవి తీవ్రంగా గాయపడగా, రాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం ఆమె కాలుపై వెళ్లడంతో తీవ్ర గాయాలు మరింత పెరిగాయి. సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ రంగారావు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని అంబులెన్స్ ద్వారా బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో కడప రిమ్స్‌కు, అక్కడి నుంచి తిరుపతిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో లక్ష్మీదేవి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహానికి పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# తల్లిదండ్రులు పిల్లలను క్రీడల్లో భాగస్వాములు చేయాలి

### ఆంధ్రప్రదేశ్ శాప్ చైర్మన్ ఏ రవి నాయుడు
### ఒంగోలు నియోజకవర్గ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు









(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 6)

తల్లిదండ్రులు పిల్లలను క్రీడల్లో భాగస్వాములు చేయాలని ఆంధ్రప్రదేశ్ శాప్ చైర్మన్ ఏ రవి నాయుడు, ఒంగోలు నియోజకవర్గ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు కోరారు. ప్రకాశం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఒంగోలు మినీ స్టేడియం నందు ఏర్పాటుచేసిన వేసవి ఉచిత శిక్షణ క్రీడా శిబిరాన్ని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి రాజరాజేశ్వరి అధ్యక్షత వహించారు. మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు రాజేశ్వరి తెలియజేశారు. ఈ శిబిరము నందు వాలీబాల్, ఫుట్బాల్, కరాటి, బాక్సింగ్, ఫెన్సింగ్, సెపక్ తక్రా వంటి క్రీడల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు మాట్లాడుతూ రెండు కోట్ల 30 లక్షల రూపాయల వ్యయంతో ఒంగోలు మినీ స్టేడియంలో ఆధునీకరణ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కొప్పోలు ప్రాంతం సమీపంలో క్రికెట్ స్టేడియం నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలియజేశారు. రానున్న రోజుల్లో ఒంగోలులో క్రీడాకారులకు అన్ని సౌకర్యాలను స్టేడియంను నిర్మిస్తామని తెలిపారు. శాప్ చైర్మన్ ఏ. రవి నాయుడు మాట్లాడుతూ వేసవి అంటే గుర్తు వచ్చేది క్రీడలు అని క్రీడల వలన వయోపరిమితి పెరుగుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం క్రీడలకు ఇస్తున్న అధిక ప్రాధాన్యతను క్రీడాకారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 55 శిక్షణ శిబిరాల ద్వారా ఉచితంగా క్రీడల పట్ల శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని క్రీడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారని రవి నాయుడు తెలిపారు. కార్యక్రమంలో బండారు మదన్, బొడ్డపాటి వెంకట్,గొల్లపూడి బాబురావు, ముత్తన్న శ్రీనివాసరావు, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కుర్ర భాస్కర్ రావు, ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు,ఫుట్ బాల్ కోచ్ పాల్,వేణు,శ్రీనివాసరావు తోపాటు క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం క్రీడా శిబిరాన్ని ప్రారంభించిన అతిధులు క్రీడాకారులతో కలిసి క్రీడలు ఆడుతూ వారిలో క్రీడా స్ఫూర్తిని నింపారు.





# తోట లోకేష్‌కు శుభాకాంక్షలు





(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 6)

గురువారం తోట లోకేష్ వివాహం సందర్భంగా అతని ఆహ్వానం మేరకు పొదిలిలో తన నివాసానికి జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు, ఉడా ఛైర్మన్ షేక్ రియాజ్, కనిగిరి జనసేనా పార్టీ ఇంచార్జ్ వరకూటి నాగరాజు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యద్ సాధిక్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేష్‌కు బొకే అందజేసి ముందస్తు వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అతిథులను పొదిలి మండల జనసేన పార్టీ నాయకులు హల్చల్ జహీర్, మదర్ వలి, గజ్జా అనీల్, సోనూ, సుల్తాన్, మహేష్, తెలుగు యువత పట్ట అధ్యక్షులు షేక్ కాలేషాలు వారిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రత్నం విద్యాసంస్థల చైర్మన్ మద్దుల శ్రీనివాస్‌ని స్థానిక వీరిశెట్టి జూనియర్ కళాశాలలో కలిసి కాసేపు ముచ్చటించారు.



# 50 శాతం సబ్సిడీ పై వ్యవసాయ పరికరాలు

(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, మే 6)

వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు సరఫరా చేయుటకు హనుమంతునిపాడు మండలానికి ప్రభుత్వం 11.96 లక్షల సబ్సిడీ కేటాయించినట్లు మండల వ్యవసాయ అధికారి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 40 హెచ్ పి వరకు సామర్థ్యం కలిగిన ఒక మినీ ట్రాక్టర్, ఒక ట్రాక్టర్ ట్రక్కు, రెండు పవర్ టిల్లర్లు, రెండు పవర్ వీడర్లు, బ్రష్ కట్టర్లు, 5 కల్టివేటర్లు, 24 స్ప్రేయర్లు రాయితీ పై మండలానికి కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్న కారు, మహిళా రైతులకు 50% సబ్సిడీ పై, ఐదు ఎకరాల కంటే ఎక్కువ ఉన్న ఇతర రైతులకు 40% సబ్సిడీ పై పరికరాలు పొందవచ్చున్నారు. సొంత భూమి కలిగిన రైతులతో పాటు గత మూడేళ్లలో కనీసం మూడు సీజన్లలో సిసిఆర్‌సి కార్డు ద్వారా ఈ-పంటలో నమోదైన రైతులు కూడా ఈ పథకానికి అర్హులు అని తెలిపారు. ఈ పథకాన్ని పారదర్శకంగా అమలు చేయుటకు ఆన్ లైన్ అప్లికేషన్‌తో పాటు లాటరీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరిగేలాగా ప్రభుత్వం విధివిధానాలను రూపొందించిందన్నారు. వ్యవసాయ పరికరాలు కావలసిన రైతులు ఆన్‌లైన్ వెబ్ అప్లికేషన్ ద్వారా లేదా రైతు సేవా కేంద్ర సిబ్బంది ద్వారా ఈ నెల 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక కూడా ఆన్లైన్ లాటరీ విధానం ద్వారా సామాజిక వర్గాల వారీగా జాయింట్ కలెక్టర్ సమక్షంలో ఈ నెల 23 నుంచి 25 తేదీలలో లాటరీ నిర్వహించబడుతుందని చెప్పారు. అనంతరం జిల్లా ఇన్చార్జి మంత్రి ఆమోదంతో లబ్ధిదారుల జాబితా విడుదల చేయడం జరుగుతుందన్నారు. లాటరీ ద్వారా ఎంపిక చేయబడిన లబ్ధిదారులు 15 రోజుల్లోగా డీలర్ కు రైతు వాటా నగదును ఆన్ లైన్ ద్వారా చెల్లింపు చేసి పరికరాలను పొందవచ్చని తెలిపారు. యాంత్రీకరణ ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు వ్యవసాయ అధికారి తెలియజేశారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com